క్లుప్తంగా

ఘనంగా సనాతన ధర్మ ప్రచార వారోత్సవాలు



అనఘాదేవి పూజ చేస్తున్న అర్చకులు

పిఠాపురం: శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సనాతన ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం ఆలయంలో అనఘాదేవి పూజలు నిర్వహించారు. పిఠాపురానికి చెందిన భక్త బృందం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొని పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలో వారం రోజుల పాటు అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ ఆర్.సౌజన్య తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు కేటీసీ విద్యార్థిని



లాస్యను అభినందిస్తున్న ఎంఈఓలు

సామర్లకోట: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఉండూరు సమీపంలోని కేటీసీకి చెందిన విద్యార్థిని బీరం లాస్య ఎంపికైంది. మంగళవారం ఆమెను ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య అభినందించారు. ఇటీవల అన్నమయ్య జిల్లా చిట్వేల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ అండర్-14 బాలికల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్టులో ఆమె పాల్గొంటుంది. ఆమెకు శిక్షణ ఇచ్చిన పీఈటీ రాంబాబును ఎంఈఓలు అభినందించారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

పెద్దాపురం: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ కోరారు. స్థానిక జట్టు లేబర్ యూనియన్ కార్యాలయంలో మంగళవారం ధర్నా కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమాన పని, వేతనం, భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్పొరేట్ సంస్థలకు దన్నుగా నిలిచి, పేదల నడ్డి విరిస్తున్న కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టే ధర్నాకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోకేడ బాబురావు, కస్నూరి వెంకన్న, బొద్దు శ్రీనివాస్, ఏడుకొండలు, శ్రీనివాస్, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

పిఠాపురం: మద్యానికి బానిసైన భర్త తనను, తన కుమారుడిని పట్టించుకోవడం లేదన్న మనస్తాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన పాలపర్తి అనంతలక్ష్మి (35) తన భర్త తమను పట్టించుకోడం లేదన్న మనస్తాపంతో ఈనెల 16న తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. దీనిని గమనించిన ఆమె కుమారుడు కేకలు వేయడంతో స్థానికులు ఆమెను కాపాడి కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతు మంగళవారం మృతి చెందినట్టు ఎస్సై వినయ్‌ప్రతాప్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సర్పంచ్ అబ్బాయికి దొరబాబు పరామర్శ



సర్పంచ్ అబ్బాయి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న దొరబాబు

పెద్దాపురం: చదలాడ సర్పంచ్ ఒబిలిశెట్టి అబ్బాయిని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు మంగళవారం పరామర్శించారు. ఇటీవల ఓ సంఘటనలో గాయపడిన అబ్బాయి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ మిరియాల రాజా, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, ఎంపీటీసీ గణేష్, కుంచే బుచ్చిరాజు, ఆకుల వీరబాబు, వాసిరెడ్డి శ్రీనివాస్, ఒబిలిశెట్టి ఆనందం, చిక్కాల శృంగార వల్లభస్వామి తదితరులున్నారు.

సాఫీగా సాగునా!

- సాగునీటి పంపిణీలో తప్పని తిప్పలు
- పీబీసీ కెనాల్‌కు ప్రాధాన్యమివ్వాలంటున్న రైతులు
- నేడు ఎత్తిపోతల పథకాల నిర్వాహకుల సమావేశం



సామర్లకోట మండలంలోని పెదబ్రహ్మదేవం ఎత్తిపోతల పథకం

సామర్లకోట: తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది సార్వా సాగు గట్టెక్కినా.. దాళ్వాపై డెల్టా ఆయకట్టు రైతుల్లో నెలకొన్న ఆందోళనకు అధికారులు చెక్ పెట్టారు. తూర్పు డెల్టాలో ధవళేశ్వరం -సామర్లకోట పంట కాలువపై ఉన్న ఆరు ఎత్తిపోతల పథకాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ.. దాళ్వా సాగు చేసుకోవాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. సామర్లకోట ప్రధాన పంట కాలువపై వేట్లపాలెం, మేడపాడు, పీబీ దేవం, ఇళ్లపల్లి, బిక్కవోలు, కాపవరం ఎత్తిపోతల పథకాలున్నాయి. ఈ క్రమంలో ఆయా పథకాల నిర్వాహకులతో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ, ఇరిగేషన్, ట్రాన్స్‌కో అధికారులు నిర్వహిస్తున్న సమీక్షా సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

గతేడాది తలెత్తిన వివాదం

ఆయా పథకాలకు మొదటి పంటకు మాత్రమే సాగు నీరిచ్చేలా ఉత్తర్వులున్నాయి. అయినప్పటికీ పథకాల నిర్వాహకులు అనధికారికంగా ఏళ్ల తరబడి దాళ్వా సాగు చేస్తున్నారు. గతేడాది దాళ్వా పంట చివరి సమయంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. నీటి ఎద్దడి కారణంగా వారానికి మూడు రోజులే మోటార్లు వాడాలని ఇరిగేషన్ అధికారులు, అలా సాధ్యం కాదని రైతులు ఘర్షణ పడిన విషయం విదితమే. ప్రస్తుతం దాళ్వాకు అనధికారికంగా ఎత్తిపోతల పథకాల ఆయకట్టులో సాగు జరిగితే అనపర్తి ఎమ్మెల్యే, పెద్దాపురం ఇన్‌చార్జిలపై ఒత్తిడి పెరిగే అవకాశాలు లేకపోలేదు.

కలెక్టరు నిర్ణయాలు అమలయ్యేనా!

గోదావరిలో నీరు పుష్కలంగా ఉన్న సమయంలో అనధికారికంగా నీరిచ్చినా.. ప్రస్తుత గడ్డు పరిస్థితుల్లో నీరిస్తే లేని ఇబ్బందులు కొని తెచ్చుకొన్నట్టేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి గోదావరి నీటి లభ్యతను బట్టి సాగునీరు ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజ్ ఎస్ఈ కేటాయించాల్సి ఉంది. అది కూడా ఆరుతడి పంటలకు మాత్రమే. ఇటీవల కాకినాడలో జిల్లా కలెక్టరు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిని ఎత్తిపోతల పథకాల నిర్వాహకులు అమలు చేసేలా చూడాలని జిల్లా కలెక్టరు వివిధ శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దాంతో వాటిని వివరించడానికి ఆరు ఎత్తిపోతల పథకాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసినట్టు ఏఓ ఐ.సత్య తెలిపారు. ఆరు ఎత్తిపోతల పథకాల్లో మూడు ఒకసారి, మరో మూడు ఒకసారి వినియోగించేలా చర్యలు తీసుకుంటారని అధికారులు చెబుతున్నారు. గోదావరి జలాలు పీబీసీకి ప్రాధాన్యమివ్వాలని కలెక్టరు ఆదేశాలున్నాయి. దాంతో ఎత్తిపోతల పథకాల నిర్వాహకులకు కొన్ని నిబంధనలు విధించక తప్పదని వ్యవసాయ, ఇరిగేషన్ వర్గాల సమాచారం.

ఇబ్బంది లేకుండా చూడాలి



దాళ్వా సీజన్‌లో ఎత్తిపోతల పథకం ద్వారా ప్రతి ఎకరాకు నీరందేలా చూడాలి. ఎత్తిపోతల పథకాల కింద సాగు చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇస్తుంది. ఈ మేరకు నీరు వృథా కాకుండా చూడాలి. ఎత్తిపోత్తల పథకాలకు సాగు నీరివ్వాలని నిర్ణయించడం అభినంద నీయం. ఎత్తిపోత్తల పథకాల నిర్వహణకు నీటి తీరువా వసూలు చేసుకునే అవకాశమిచ్చారు. సార్వాకు రూ.600, దాళ్వాకు రూ.800 వసూలు చేస్తారు. ఎత్తిపోతల పథకాల నిర్వహణ కష్టంగా ఉంది. ప్రభుత్వం కొంత సహకరించాలి.

– పుట్టా సోమన్నచౌదరి, ఉమ్మడి జిల్లా ఎత్తిపోతల సమాఖ్య అధ్యక్షుడు, మర్రిపూడి

అలరించిన జ్యోతిర్లింగార్చన



సామర్లకోట పంచారామ క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: కార్తిక మాసం అనగానే దీపాలకు ప్రసిద్ధి. ఈ మాసం ప్రారంభమైనప్పటి నుంచి భక్తులు తెల్లవారుజామున, రాత్రి కార్తిక దీపాలు వెలిగిస్తున్నారు. స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో లక్ష పత్రి పూజలు చేసుకుంటున్న భక్తులకు ఆలయ దీపారాధన సంఘ సభ్యులు జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం కూడా జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. నిత్యం ధ్వజస్తంభం వద్ద దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు పూజల్లో పాల్గొని, ఆకాశ దీపం వెలిగిస్తున్నారు. భక్తులకు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు సేవలందించారు.

సంక్షేమానికి వారధి గడప గడపకూ

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- బి.ప్రత్తిపాడులో పర్యటన



లబ్ధిదారుకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: సంక్షేమ పథకాల అమలులో ఆంధ్ర ప్రదేశ్ దేశంలోనే ముందంజలో ఉందని ఇతర రాష్ట్రాల నేతలు మన పథకాల అమలును ఆదర్శంగా తీసుకునేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడులో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరించి సమస్యలు తెలుసుకున్నారు. నియోజకవర్గంలో 85 సచివాలయాలు ఉండగా ఇప్పటివరకు 80 సచివాలయాలను సందర్శించామన్నారు. 233 రోజుల్లో సుమారు 93 వేల కుటుంబాలను కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించామన్నారు. ప్రతి గ్రామంలోను మౌలిక సదుపాయాల కల్పన పథకాల పంపిణీకి వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలన ప్రజల ముంగిటకు చేరిందన్నారు. గతంలో ఏ చిన్న పని కావాలన్నా సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని ఇప్పుడు ఇంటికి సమీపంలోనే పనులు అయిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఊటా రామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జవ్వాది నాయుడు, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు మొగలి బాబ్జీ, కొత్తపల్లి రమణబాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

జనం జగనే కావాలంటున్నారు

పేదల బతుకులు పూర్తిగా మారాలంటే రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు పేర్కొన్నారు. బి.ప్రత్తిపాడులో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్‌లో ఆయన పాల్గొని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో ఉన్న బోర్డును ఆవిష్కరించారు. ప్రతీ ఇంటికి వెళ్లి రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలో వివరించారు. అనంతరం ఆయన గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీకి చెందిన కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మతి భ్రమించి మాట్లాడుతున్నారు



అమీనాబాద్‌లో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న సుదర్శన్

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- అమీనాబాద్‌లో గడప గడపకూ..

కొత్తపల్లి: చంద్రబాబు ప్రతిపక్ష నేత కావడం ఈ రాష్ట్రానికి పట్టిన ఖర్మ అని, ఆయన మాట్లాడుతున్న భాష సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేదిలా ఉందన్ని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలో అమీనాబాద్‌లో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి ఇంటికీ ఆయన వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తెలియజేశారు. పాలన వికేంద్రీకరణ కావాలని కర్నూలు ప్రాంత ప్రజలు, న్యాయవాదులు కోరుతుంటే దానికి సమాధానం చెప్పకుండా తాము అధికారంలోకి వస్తే బట్టలూడదీసి కొడతామని హెచ్చరించడం చూస్తుంటే ఆయనకు మతిభ్రమించినట్లు భావిస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు బాదుడే బాదుడు అంటూ ప్రజల్లోకి వెళ్లగా స్పందన లేకపోవడంతో ఆ కార్యక్రమాన్ని నిలిపివేశారని గుర్తుచేశారు. తాము గడప గడపకూ మన ప్రభుత్వం కార్యమంలో భాగంగా గ్రామాలకు వెళ్తుంటే ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మొగిలి బాబ్జీ, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, సర్పంచ్ నక్కా మణికంఠ, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు బండి దావీదు, మండల ప్రత్యేక అధికారి నారాయణ మూర్తి, ఎంపీడీవో ప్రభాకర్ రామారావు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అన్నారు. మండలంలోని మూలపేటలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. గృహసారథులకు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ సమకూర్చిన కిట్లను పంపిణీ చేశారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. అభివృద్ధిని ప్రతి ఒక్కరూ గుర్తించి మళ్లీ వైఎస్సార్ సీపీ విజయానికి నాంది పలకాలని కోరారు. ఏ ప్రభుత్వమూ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించలేదని, గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ, పచ్చ చొక్కాల నాయకులు చెప్పిన వారికే వర్తింపజేసేవారు. మత్స్యకార గ్రామాలను అభివృద్ధి చేసే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాము. కొంతమంది స్వార్థపరులు, పచ్చ చొక్కాల నాయకులు ఎల్లో మీడియా ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేక దుష్ప్రచారాన్ని చేస్తున్నాయి. వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. సర్పంచ్ కంబాల మౌనిక, ఎంపీటీసీ గోగు లోవకుమారి, వడిగే కనకమహేశ్వరరావు, సిద్ధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాటకు కట్టుబడి పథకాల అమలు

'వై ఏపీ నీడ్స్ జగన్'లో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



చంద్రంపాలెంలో పార్టీ జెండాను ఆవిష్కరించిన దవులూరి దొరబాబు



పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దొరబాబు

సామర్లకోట: ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశంలో జగన్మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండల పరిధిలో చంద్రంపాలెం గ్రామంలో మంగళవారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్ర మంలో సర్పంచ్ చీమల భవాని, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు మండపాక దొరబాబు, తలాటం శ్రీనివాసుల ఆధ్వర్యంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దొరబాబు మాట్లాడుతూ మహిళా సంఘాలకు నాలుగు దఫాల్లో రుణమాఫీ అమలు చేస్తానని చెప్పి ఇప్పటికే మూడు పర్యాయాలు అందజేసినట్టు చెప్పారు. అలాగే చేయూత పథకాన్ని మూడు సార్లు అందజేశారని తెలిపారు. ఈ పథకాలకు గడువు ఉన్నా, వీటిని ఎన్నికల ముందే అమలు చేసి ఇచ్చిన మాటను నిరూపించుకోవడానికి జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కరోనా సమయంలో కూడా అన్ని పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ పథకాలను ఇతర రాజకీయ పార్టీలు కాపీ కొడుతున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ఆయా పార్టీలు ఇచ్చే హామీలపై ఆలోచన చేసి, జాగ్రత్తగా ఉండాలని దొరబాబు హితవు చేశారు. తొలుత సచివాలయం పరిధిలో లబ్ధిదారుల జాబితా బోర్డును దొరబాబు ఆవిష్కరించి, గ్రామంలో పార్టీ జెండాను ఎగుర వేశారు. ఈ కార్యక్రమానికి పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు అధ్యక్షత వహించారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపీపీ పేర్నిడి వెంకట్రాయుడు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మండపాక సురేష్, పార్టీ సీనియర్ నాయకుడు ఎలిశెట్టి నరేష్, జేసీఎస్ కన్వీనర్ ఊటా వాసు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి

పెద్దాపురం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమాభివృద్ధి పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. కట్టమూరు సచివాలయం-1, 2 పరిధిలో మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని గుర్తించి, రెండోదఫా వైఎస్సార్ సీపీ విజయానికి ప్రజలు నాంది పలకాలని కోరారు. తద్వార ప్రజలకు మరింత లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఇనకొండ వీర విష్ణుచక్రం, ఏలేటి అనంతలక్ష్మి, గ్రామ పార్టీ అధ్యక్షుడు నల్లల గోవిందు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. తొలుత పార్టీ జెండాను, పథకాల బోర్డును దొరబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు చల్లా చినవీర్రాజు, మండల కో-ఆప్షన్ సభ్యుడు బిక్కిన సూర్యకుమారి, ఎంపీటీసీలు నల్లల సూర్యకుమారి, ఉప్పటి ప్రసాద్, జోడుగుళ్ల చైర్మన్ మేడిద వెంకట రామారావు, ఉప సర్పంచ్ బండారు చంటిబాబు, పార్టీ నాయకులు పెంటా విజయ్‌కుమార్, జీను రమణ, సిద్దాంతపరు ప్రసాద్, భూషణం, ఆకుల వీరబాబు, నరాలశెట్టి త్రినాథ్, లక్కాకుల కృష్ణ, ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మూర్తి, సచివాలయ కార్యదర్శి రాధాకృష్ణ పాల్గొన్నారు.

కాజ్‌వేను పరిశీలించిన ఇన్‌చార్జి ఎంపీడీఓ



వీకే రాయపురంలో శిథిలకాజ్‌వేను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ, రైతు సంఘ నాయకులు

సామర్లకోట: వీకే రాయపురంలో శిథిల కాజ్‌వేను ఇన్‌చార్జి ఎంపీడీఓ కర్రి హరికృష్ణసత్యారెడ్డి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. గ్రామంలో ఏలేరులో కాలువలో ఉన్న కాజ్‌వే శిథిలం కావడంతో 'సాక్షి'లో వచ్చిన కథనం మేరకు జిల్లా కలెక్టరు కృతికా శుక్లా తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.1.43 లక్షలు మంజూరు చేశారు. ఆ పనులను పర్యవేక్షించాలని ఎంపీడీఓకు ఆదేశాలు జారీ చేశారు. ఎంపీడీఓ సెలవులో ఉండటంతో, ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఉన్న హరికృష్ణ సత్యారెడ్డి ఆ కాజ్‌వేను పరిశీలించారు. కాజ్‌వేకు తూరలు వేసి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేసేలా పర్యవేక్షించారు. రైతుల పొలాలు ఏలేరు కాలువ ఆవలి వైపు ఉండటంతో, ధాన్యాన్ని కాజ్‌వే మీదుగా మాత్రమే తీసుకురావాల్సి ఉంది. దాంతో యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు తాము కొన్ని నిధులు జమ చేయాల్సి ఉంటుందని రైతు సంఘ నాయకులు కుర్రా శ్రీనివాసు, వెలమర్తి బుల్లిరాజు, ఇంటి వెంకట్రావు, వెలమర్తి శ్రీనివాసులు ఇన్‌చార్జి ఎంపీడీఓకు తెలిపారు. జిల్లా కలెక్టరు మంజూరు చేసిన నిధులకు జీఎస్టీ లేకుండా చూడాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

ఈసీ ఆదేశాలు పాటించాల్సిందే..

అవగాహన సదస్సులో ఆర్డీవో రామారావు



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రామారావు

పెద్దాపురం: ఎన్నికల కమిషన్ ఆదేశాలను కచ్చితంగా పాటించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఛాంబర్‌లో మంగళవారం సాయంత్రం ఎలక్ట్రరోల్, సెక్టార్, రూట్ అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. రానున్న సాధారణ ఎన్నికల్లో సిబ్బంది చేపట్టాల్సిన విధులు, బాధ్యతలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జేఎస్ రామారావు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సెక్టార్, రూట్ అధికారులు పరిశీలించాలన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ లతాకుమారి, సీఐలు రవికుమార్ సురేష్, ఎస్సై వెలుగుల సురేష్, తహసీల్దార్ జితేంద్ర, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డీఎల్‌పీఓ బాలామణి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో..

అనంతరం ప్రతి వారం నిర్వహించే ఓటర్ జాబితా సవరణ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్డీవో రామారావు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలపై ప్రజా ప్రతినిధులు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. నియోజకవర్గ పరిధిలో 2,08,930 మంది ఓటర్లు ఉన్నారని, పురుషులు 1,03,001, స్త్రీలు 1,05,916, ఇతరులు 13 మందితో కూడిన ఓటర్ల జాబితాను ప్రచురించినట్టు చెప్పారు. ఓటర్ల జాబితా విధానంపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మేనేజర్ జ్యోతిరాణి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు,(వైఎస్సార్ సీపీ), రంధి సత్యనారాయణ (టీడీపీ), చింతా శ్రీనివాసరావు (వైఎస్సార్ సీపీ)తో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన సామాజిక బాధ్యత

పెద్దాపురం: ప్రతిఒక్కరిపైనా బాల్య వివాహాల నిర్మూలన బాధ్యత ఉందని పెద్దాపురం ఐసీడీఎస్ సీడీపీఓ ఉష, వెలుగు ఏపీఎం సూర్యనారాయణ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం బాల్య వివాహాల చట్టాలపై యానిమేటర్లు, మహిళా సమాఖ్య సంఘాల ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి అధ్యక్షత వహించారు. ఉష, సూర్యనారాయణ మాట్లాడుతూ బాల్య వివాహాలు ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. బాల్య వివాహాలు చేస్తున్నట్టు తెలిస్తే 1098, 100 వంటి టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలన్నారు. వెలుగు సీసీలు తవుడు, దుర్గ, కుమారి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ ఉష

బీజేపీ కన్వీనర్‌గా బుర్రా కృష్ణంరాజు

పిఠాపురం: నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా బుర్రా కృష్ణంరాజు, కోకన్వీనర్‌గా వాసంశెట్టి శ్రీనివాస్‌లను నియమించినట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు పుసుపులేటి సత్యనారాయణ తెలిపారు. నూతనంగా పార్టీ బాధ్యతలు చేపట్టిన నాయకులను మంగళవారం బీజేపీ నేతలు సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, గండి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత యువతికి దిశ రక్ష

కాకినాడ క్రైం: కాకినాడకు చెందిన ఓ యువతి యువకుడి చేతిలో వేధింపులకు గురైన నేపథ్యంలో దిశ యాప్ అండగా నిలిచింది. వివరాల్లోకి వెళితే నగరానికి చెందిన ఓ యువతి తన పూర్వపు సహ విద్యార్థి తరుణ్ చేతుల్లో కొన్నాళ్లుగా వేధింపులకు గురవుతోంది. చదువుకున్న రోజుల్లో తన వద్ద ఉన్న ఫొటోలు మార్ఫింగ్ చేసి యువతిని బ్లాక్‌మెయిల్ చేస్తూ వక్రబుద్ధి చూపించి కొన్నాళ్లుగా వేధిస్తున్నాడు. మంగళవారం ఆమె ఇంటి నుంచి బయలుదేరగా ఆమె వెంటపడి బెదిరించడం మొదలుపెట్టాడు. దీంతో దిశ యాప్ ద్వారా పోలీసులను ఆశ్రయించింది. తక్షణమే అక్కడకు చేరుకున్న పోలీసులు యువతిని రక్షించారు. వారిని చూసి తరుణ్ పరార్ కాగా సాయంత్రానికి గాలించి కాకినాడ త్రీటౌన్ పోలీసుస్టేషన్‌కు చేర్చారు. తరుణ్‌కు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి హెచ్చరించారు. దిశ యాప్ ద్వారా తాను రక్షణ పొందానని యువతి పోలీసులకు ధన్యవాదాలు తెలిపింది. దిశ యాప్ సత్ఫలితాలనిస్తోందని, యువతులు, మహిళలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు.